

చెట్టుకు రక్షాబంధన్ : పర్యావరణంపై అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని ఎంఎస్ఎన్ ఛారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎంఎస్.సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం ఏపి నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో జగన్నాథపురం ఎంఎస్ఎన్ ఛారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో వేప చెట్టుకు రాఖీ కట్టి రక్షాబంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఎంఎస్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. మొక్కలు పెంచడం జీవితంలో భాగం కావాలన్నారు. ఏపి నేషనల్ గ్రీన్‌కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ చెట్లు మన తోబుట్టువులన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి- సంరక్షించాలన్నారు. వినూత్నంగా గ్రీన్ కోర్ విద్యార్థులు చేసిన ఈ కార్యక్రమాన్ని అందరూ అభినందించారు.

ఛార్జీల భారాలపై సిపిఎం సమరభేరి

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతున్న భారాలపై సిపిఎం చేపట్టిన ప్రచార సమర భేరి కార్యక్రమం జిల్లాలోని పలుచోట్ల గురువారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. పోస్టర్లు ఆవిష్కరించారు. ప్రజలకు అవగాహన కల్పించారు.

కాకినాడ 37వ డివిజన్ పాత బస్టాండ్, వెంకటేశ్వర కాలనీ ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలు పంచుతూ, సంతకాలు సేకరించారు. సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి, సిహెచ్.రమణి మాట్లాడారు. మోడీ అధికారంలోకి వచ్చిన సమయంలో రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ నేడు రూ.1200కు చేరిందన్నారు. కాకినాడ సమీపంలో పుష్కలంగా చమురు నిక్షేపాలు ఉన్నాయన్నారు. గ్యాస్‌ను గుజరాత్ తరలించి కార్పొరేట్ కంపెనీలకు లాభాలు దోచిపెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల జిమ్మిక్కులో భాగంగా గ్యాస్‌పై రూ.200 తగ్గిస్తున్నట్లు ప్రకటించారని, చిత్తశుద్ధి ఉంటే రూ.400కే గ్యాస్ సరఫరా చేయాలని సవాల్ విసిరారు. ఈ ప్రచారంలో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు మలకా వెంకట రమణ, కె.నాగజ్యోతి, సి.వేణు, భూలక్ష్మి, కుమారి, సత్యనారాయణ, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ సిటీలో..



కాకినాడ రూరల్‌లో..

కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామంలో సిపిఎం సీనియర్ నాయకులు చింతపల్లి అజయ్ కుమార్ పోస్టర్ ఆవిష్కరించారు. దేశంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశం అంటుతున్నాయన్నారు. ప్రజల ఆదాయాలు నేల మీదే ఉన్నాయన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందని, తాను అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన మోడీ 9 ఏళ్ల కాలంలో ఎన్ని కోట్లు ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.రాజా, దుర్గ, సతీష్, మంగ, వెంకయ్యమ్మ, వెంకటలక్ష్మి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



కాజులూరులో..

కాజులూరు మండలం చేదువాడ గ్రామంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా చేదువాడ వంతెన వద్ద సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, మండల కన్వీనర్ వల్లు రాజబాబు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లలో అడ్డూ అదుపూ లేకుండా ధరలు విపరీతంగా పెంచేసిందన్నారు. కేంద్రం ఆర్డర్ వేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు పెంచుతోందన్నారు. ఈ కాలంలో నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. విద్యుత్ ఛార్జీలు రూ.400 అయితే మరో రూ.300 అదనపు ఛార్జీల పేరిట ప్రజల వద్ద ముక్కు పిండి వసూలు చేస్తున్నారన్నారు. ఈ భారాలు తగ్గించాలని దేశవ్యాప్తంగా సిపిఎం ప్రచారం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కురుపూడి భూచక్రం, దంగేటి శ్రీనివాసులు, సందాల సూర్యనారాయణ, కురుపూడి రాంబాబు, గంజా అప్పారావు, మాజీ సర్పంచ్ పెంకే సూర్యనారాయణ, గెద్దాడ సత్తిబాబు, షాజహాన్, పెంకే శ్రీనివాసు పాల్గొన్నారు.

పాత విధానం కోసం లేఖర్ల నిరసన

ప్రజాశక్తి-కాకినాడ, ఏలేశ్వరం



కాకినాడలో లేఖర్ల నిరసన

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉపాధి పొందుతున్న లేఖర్లు, ప్రజల భూములు, ఆస్తులకు రక్షణ కల్పించే పాత రిజిస్ట్రేషన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ దస్తావేజుల లేఖర్లు బుధవారం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకువచ్చి లేఖర్లను రోడ్లు పాలు చేస్తోందన్నారు. కొత్త ప్రైమ్ 2.0 విధానంలో రిజిస్ట్రేషన్ వల్ల అమ్మకందారులకు, కొనుగోలుదారులకు, భూ యజమానులకు ఎటువంటి రక్షణ ఉండకపోగా వారికి నష్టం కలిగిస్తుందని చెప్పారు. ఈ విధానాన్ని మార్పు చేయాలని పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్ చేయాలని బుధ, గురువారాల్లో పెన్ డౌన్ చేస్తున్నట్లు చెప్పారు. దీనికి కొనుగోలు, అమ్మకం దారులు సహకరించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని మార్చుకొని పాత విధానాల్లో రిజిస్ట్రేషన్ చేస్తూ ఐదు లక్షల లేఖర్ల కుటుంబాలకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ నిరసనలో రాష్ట్ర లేఖరుల సంఘం అధ్యక్షుడు బిజె ప్రసాద్, కాకినాడ జిల్లా అధ్యక్షుడు చోడపునీడి గోవిందు, కార్యదర్శి గీసాల శ్రీను, కాకినాడ సిటీ అధ్యక్షుడు జాడ అప్పలరాజు, లేఖర్లు వివివి సత్యనారాయణ, సత్య ప్రసాద్, పివివి రమణ, డీజే మోహన్ రావు, సత్తిబాబు పాల్గొన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోరుతూ దస్తావేజు లేఖర్లు రెండో రోజు ప్రత్తిపాడు రిజిస్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షకు టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ వరుపుల సత్యప్రభ సంఘీభావం తెలిపారు. ఆమె దీక్షలో కూర్చున్నారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 2.0 విధానం వలన దస్తావేజులేఖర్లు, సహాయకులు, స్టాంపు వెండర్లు ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, దస్తావేజులేఖర్లు పంచదార్ల నాగేశ్వరరావు, ఇర్లంకి రాంబాబు, చిలకమర్తి వెంకటరమణ, అత్తి ఉమామహేశ్వరరావు, రాయవరపు హనుమంతరావు, అనిశెట్టి బెన్నయ్యదొర, భారతి తదితరులు ఉన్నారు.

కనీస వేతనాల కోసం ఆర్‌పిల వినతి

ప్రజాశక్తి-కాకినాడ



మాట్లాడుతున్న ఫణీశ్వరరావు, పల్లి జయలక్ష్మి

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ ఎపి అర్బన్ ఏరియా రిసోర్స్ పర్సన్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియకు రిసోర్స్ పర్సన్లు వినతి పత్రం అందించారు. గురువారం రిసోర్స్ పర్సన్ల ట్రేడ్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సబ్బతి ఫణీశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షురాలు పల్లి జయలక్ష్మి ఆధ్వర్యంలో కలెక్టరేట్లో జెసికి తన ఛాంబర్‌లో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సబ్బతి, జయలక్ష్మిలు మాట్లాడుతూ తాము 2007 నుంచి మెప్మా పరిధిలో రిసోర్స్ పర్సన్లుగా పనిచేస్తున్నామని తమకు వేతనం నెలకు రూ.8 వేలు ఇస్తున్నారని చెప్పారు. కొన్ని నిబంధన వల్ల ఆ వేతనం కూడా రాకపోగా గ్రామ సంఘాల ఆధ్వర్యంలో వారిని బతిమాలుకుని వేతనం పొందుతున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తాము అత్యంత కీలకపాత్ర నిర్వహిస్తున్నామని, నాడు జగన్ పాదయాత్ర చేసిన సందర్భంగా రూ.10 వేలు వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని, దాన్ని అమలు చేయాలని వారు కోరారు. తమను వర్కర్లుగా గుర్తించాలని, మూడేళ్ల కాలపరిమితి నిబంధన తొలగించాలని, కనీస వేతనం అమలు చేయాలని వారు కోరారు. తమ న్యాయమైన కోర్కెలను అమలు చేయాలని ఆయా జిల్లాల్లో కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.కుమారి, పివి.దుర్గా, సిహెచ్.రాధాదేవి, ఎస్.నాగలక్ష్మి, జి.దేవి, టి.ఉష, ఎస్.షకీలా తదితరులు పాల్గొన్నారు.

కాకినాడకు ద్వితీయ స్థానం గర్వ కారణం


ప్రజాశక్తి-కాకినాడ

ఇండియన్ స్మార్ట్ సిటీ అవార్డ్స్ - 2022 లో దేశంలోనే కాకినాడకు రెండో స్థానం దక్కడంలో ప్రధాన భూమిక వహించిన పారిశుధ్య విభాగాన్ని నగర ప్రజల తరపున గౌరవించనున్నట్లు సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి జగన్నాథపురం నేతాజీ పార్క్ వరకు పారిశుధ్య కార్మికులకు పూలాభిషేకంతో ర్యాలీ నిర్వహించనునట్టు ఎంఎల్ఎ చెప్పారు. దారి పొడవునా వ్యాపారులు, ప్రజలు కార్మికులపై పువ్వులు జల్లి అడుగడుగునా వీరిని గౌరవిస్తారన్నారు. ర్యాలీ అనంతరం జగన్నాథపురం నేతాజీ పార్క్ వద్ద కేక్ కట్ చేసి కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్మికులను ఘనంగా సత్కరిస్తామన్నారు. ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయక ప్రజారోగ్య పరిరక్షణ కోసం పారిశుధ్య కార్మికులు విశిష్ట సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైసిపి నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎఎంసి చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, జెసిఎస్ కన్వీనర్లు సుంకర విద్యాసాగర్, రాగిరెడ్డి సుబ్బారావు, మాజీ డిప్యూటీ మేయర్ చోడిపల్లి సత్యప్రసాద్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్ క్రాస్ వింగ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలకు చెందిన 114 మంది విద్యార్థులు, అధ్యాపకులు రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌కు రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు నాయుడు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్, ఆదిత్య డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన విద్యార్థులను అభినందించారు. ఒక వ్యక్తి రక్తదానం వల్ల నలుగురి ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. అన్ని దానాల కన్నా రక్త దానం గొప్పదన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సేవా కార్యక్రమాల్లో ముందుండేలా అవగాహన కల్పిస్తున్నామని, రక్తదానం చేయడం ఒక అలవాటుగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులను అభినందించారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో ముందుంటారని, బ్లడ్ బ్యాంకులలో రక్త నిల్వలు తగ్గుతున్న ప్రతిసారీ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ రక్తదానం చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన విద్యార్థులను, 19వ సారి రక్తదానం చేస్తున్న తేజేశ్వరరావును, 16వ సారి రక్తదానం చేస్తున్న దివాకర రావును, అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వింగ్ బందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, కాకినాడ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వైడి.రామారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ దుర్గరాజు, బ్లడ్ బ్యాంక్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అప్పలరాజు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జిమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, ఎల్.దివాకర రావు, అధ్యాపకులు ఐ.రాజేష్ కుమార్, పి.శ్రీను, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్స్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో ఆదిత్య యాజమాన్యం, సిబ్బంది



నెహ్రూను పరామర్శిస్తున్న ఒమ్మి రఘురామ్, నాయకులు

నెహ్రూకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి-జగ్గంపేట రూరల్

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూను గురువారం పలువురు పరామర్శించారు. వైసిపి సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురామ్, కిలపర్తి వీరబాబు, నీలపల్లి అప్పారావు, దత్తి శ్రీనివాస్, పచ్చిపులుసు వీరబాబు, కట్టు రాజు, పకుర్తి శివ, తదితరులు ఉన్నారు. అనపర్తి మాజీ ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నెహ్రూను పరామర్శించారు. అనంతరం నెహ్రూ సోదరి తోట నాగలక్ష్మి చిత్రపటానికి పూలమాలవేసి నివాలర్పించారు. ఈ కార్యక్రమంలో యర్రబత్తుల గోవిందు నాయుడు, కొండపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పండుగ

ప్రజాశక్తి-గండేపల్లి

మండలం ప్రతి ఇంటా ఆనందోత్సాహాలతో రాఖీ పండుగ సంబరాలు జరుపుకున్నారు. దీనిలో భాగంగా ఆదిత్య అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి ఇంట రాఖీ పూర్ణిమ పర్వదినం సందర్భంగా సంబరాలు సాగాయి. శేషారెడ్డి సోదరీమణులు వారి కుటుంబ సభ్యులు పిల్లలు అందరూ ఒకే చోట కలిసి సందడిగా రాఖీ పూర్ణిమ పండగను జరుపుకున్నారు. మల్లేపల్లిలోనివెల్ది వెంకటరత్నం సోదరి ఇంటిలో రాఖీ పండగతో సందడి వాతావరణం నెలకొంది.

అధికార పార్టీ అండతో ఇళ్ల కూల్చివేత

ప్రజాశక్తి-కరప

అధికార పార్టీ నేతల అండతో విజయవాడకు చెందిన ఒక మహిళ 40 మంది రౌడీ షీటర్లను వెంటబెట్టుకుని జెసిబితో షెడ్లు కూల్చివేసిన సంఘటనలో మనస్తాపానికి గురై ఒక మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆలస్యంగా వెలుగు చేసిన ఈ సంఘటనపై బాధితులకు అండగా నిలుస్తామని సిపిఎం నేతలు భరోసా ఇచ్చారు.

మండలంలోని గురజనాపల్లి చిన్నదళిత పేటలో 16 సెంట్లు భూమిని దడాల రామలక్ష్మి తన కూతురు విజయలక్ష్మికి పసుపు కుంకుమ కింద ఇచ్చారు. ఈ స్థలాన్ని కాకినాడ రూరల్ తూరంగి గ్రామానికి చెందిన బాబులుకు ఆమె అమ్మారు. కొనుగోలు చేసిన బాబులు ఈ స్థలాన్ని ఇళ్ల స్థలాలుగా విడదీయడంతో బాబులు వద్ద నుంచి పెంకే నారాయణమూర్తి, ధోని శివప్రసాద్, టేకుమూడి కనకలక్ష్మి, మాసారాజు, లంకె గౌరీ ఇళ్లు నిర్మించుకునేందుకు స్థలాలు కొనుగోలు చేసి పాకలు, రేకులు షెడ్లు వేసుకున్నారు. దడాల రామలక్ష్మికి చెందిన బంధువు విజయవాడలో ఉంటున్న కాకుల విజయ ఆ స్థలం తనదని, స్థలంలో ఉన్న పాకలు, షెడ్లు తొలగించాలని 40 మంది రౌడీలను వెంటబెట్టుకుని జెసిబితో దౌర్జన్యంగా పాకలు, షెడ్లు తొలగించి బోర్డు ఏర్పాటు చేశారు. జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేసిన బాధితులను రక్షించాల్సిన పోలీసులు పట్టించు కోకుండా కూల్చివేతకు దిగిన వారికి అనుకూలంగా వ్యవహరించారు. తమకు న్యాయం కావాలంటూ అధికారులు, స్థానిక నాయకులు, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగిన ఎవరు స్పందించకపోవడంతో బాధితులు కలెక్టరేట్‌లో ఈ నెల 28న ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారించేందుకు ఈ నెల 29న పోలీసులు బాధితులను కరప పోలీసులు స్టేషన్‌కు పిలిచారు. అక్కడ పోలీసులు బాధితులను సంబంధం లేని వ్యక్తిగత విషయాలపై ఆరా తీసి బెదిరించారు. దీంతో లంకే గౌరి ఎలుకల మంది తిని అపస్మారక స్థితికి చేరుకుంది బాధితులు ఆమెను చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రి తరలించారు. ఈ సంఘటన తెలిసిన ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి, జిల్లా ట్రెజరర్ కె.జ్యోతి, భవాని, సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, నాయకులు పలివెల వీరబాబు గురజనాపల్లిలో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ అధికార పార్టీ అండదండలతోని ఈ రకంగా పేదల నుంచి భూమిని లాక్కుని దందా చేస్తున్నారన్నారు. కాకినాడ రూరల్‌లోని ఈ దందాకు అధికార పార్టీ ఎంఎల్ఎ అండదండలు ఉన్నాయని బాధితులు తెలిపారన్నారు. పోలీసులు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం ఏమిటని ప్రశ్నించారు. న్యాయపరంగా సమస్య పరిష్కారం అయ్యేంతవరకు బాధితులు పక్షాన సిపిఎం వారికి అండగా ఉంటుందని రాజశేఖర్ అన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నేత రాజశేఖర్

ఉప్పాలమ్మ వారిని దర్శించుకున్న కన్నబాబు

ప్రజాశక్తి -కరప


శ్రావణ పౌర్ణమి సందర్భంగా కరప ఉప్పాలమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన కుంకుమ పూజ కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వేములవాడ సర్పంచ్ మంగాదేవి ఎంఎల్ఎ కన్నబాబుకు రాఖీలు కట్టారు. అనంతరం గుడి వద్ద ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఆయన ప్రారంభించారు.

విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-ఏలేశ్వరం

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యత ఇస్తోందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిని 50 పడకలకు అభివృద్ధి చేస్తూ నిర్మించిన నూతన భవనాలను ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌తో కలిసి ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. ఆసుపత్రిలో వైద్యులు వైద్య సిబ్బంది నియామకంతో పాటు పూర్తిస్థాయిలో మందులు ఏర్పాటుకు ఎటువంటి లోటు లేకుండా నిధులు కేటాయిస్తున్న ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆసుపత్రి ఆవరణలో మెప్మా సిబ్బంది ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను వారు ప్రారంభించారు. ఈ క్యాంటీన్లో తక్కువ ధరకు నాణ్యమైన టిఫిన్ భోజనం రోగులు, బంధువులకు అందజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, వైస్ చైర్‌పర్సన్‌లు శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి, జువ్వెన వీర్రాజు, కమిషనర్ కెఎ.కొండలరావు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



యువగళానికి సంఘీభావంగా పాదయాత్రలు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 200 రోజులు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఆయనకు సంఘీభావంగా పలుచోట్ల పాదయాత్రలు చేపట్టారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ కార్పొరేషన్ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి జగన్నాథపురం ఘాటీ సెంటర్ నుంచి నరసింహారోడ్, పరదేశమ్మపేట మీదుగా జగన్నాథపురం వంతెన, భవన్నారాయణ సెంటర్, శివాలయం మీదుగా మున్సబ్ గారి జంక్షన్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని, వైసిపి అరాచక పాలనలో భీతిల్లిన కోట్లాది మంది ప్రజలకు నేనున్నా అని ఒక భరోసా ఇవ్వడమే లక్ష్యంగా పాదయాత్ర సాగుతోందన్నారు. నియోజకవర్గ పరిశీలికలు నాగిడి నాగేశ్వరరావు మాట్లాడుతూ నాలుగేళ్ల వైసిపి పాలనలో జగన్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, పాలిక నాని, గెడ్డం పూర్ణ చంద్రశేఖర్, పెదపూడి కుమార్, నసింహదేవర విశ్వనాథం, గదుల సాయిబాబా, పంతాడి రాజు, హోతా రవి, తాజుద్దీన్, ఆన్వర్, మేడిశెట్టి చిన్ని, మేడిశెట్టి బుజ్జి, గాది శివ, మల్లిపూడి నాగదీపిక, తుమ్మల సునీత రమేష్, కొల్లు కుమారి, మూర్తి, బంగారు సత్యనారాయణ, గోపిశెట్టి బూరయ్య, అరదాడి శివ, ఖాన్, గుర్రాల హరిబాబు, రేకాడి లోవరాజు, చింతా పేర్రాజు, గుత్తుల రమణ, ఒమ్మి బాలాజీ పాల్గొన్నారు. **కిర్లంపూడి** మండలం పాలెం గ్రామం నుంచి రామచంద్రపురం దుర్గమ్మ ఆలయం వరకు టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ పాదయాత్ర చేపట్టారు. మహిళలు నవీన్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. నవీన్ వారందరికీ చీరలు బహూకరించారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు యనమల శివరామకృష్ణ, జ్యోతుల నవీన్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో యువగళం పాదయాత్ర ప్రారంభమై 200 రోజులు పూర్తవడం చరిత్రలో మరిచిపోనిదన్నారు. నారా లోకేష్ రాష్ట్రంలోని అన్ని రంగాల ప్రజలను కలుసుకుంటూ వారి కష్ట సుఖాలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్న విధానం రాష్ట్రంలోని ప్రజలందరినీ ఆకర్షించిందన్నారు. **తాళ్లరేవు** ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. సీతారాంపురం గుడ్డు వాని తూము సెంటర్ నుండి ప్రారంభమైన పాదయాత్ర సినిమా హాలు, సంతపేట మీదుగా ఆర్యవైశ్య సంఘ భవనం వరకు సాగింది. ఈ సందర్భంగా దారి పొడుగునా నారా లోకేష్, చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం మండల స్థాయి బూత్ లెవెల్ ఇన్చార్జిలతో ఆర్యవైశ్య సంఘ భవనంలో సమీక్ష నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో పూర్తిస్థాయిలో బూత్ లెవెల్ ఇన్చార్జిలు కీలకపాత్ర పోషించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, టిడిపి నాయకులు నాగిడి నాగేశ్వరరావు, మందాల గంగ సూర్యనారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ, వాడ్రేవు వీరబాబు, కట్టా త్రిమూర్తులు, వాసంశెట్టి శ్రీనివాస్, మోపూరి వెంకటేశ్వరరావు, పిల్లి సత్తిబాబు, పొన్నమండ రామలక్ష్మి, వెంటపల్లి చంద్రమౌళి, దాసరి వేణుగోపాల్ పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో సంఘీభావంగా పాదయాత్ర చేపట్టారు. తొలుత గాంధీ బొమ్మసెంటర్లో మహాత్మాగాంధీ విగ్రహానికి మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, పెద్దాపురం ఎంఎల్ఎ చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘీభావ ర్యాలీ గాంధీబొమ్మ సెంటర్, రింగ్ సెంటర్, రథం సెంటర్, గోలి వారి వీధి, బళ్ళ మార్కెట్ నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకు నిర్వహించారు. పార్టీ నాయకులు అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, కంటే జగదీష్ మోహన్, గుమ్మళ్ల రామకృష్ణ, ఆకునూరి సత్యనారాయణ, చల్లా బుజ్జి, కాకినాడ రామారావు, పడాల వీరబాబు, కోటఅప్పారావు, కాళ్ల రవీంద్రబాబు, పడాల వీరబాబు, తాతపూడి అరుణ్ వంశీ పాల్గొన్నారు.



కిర్లంపూడిలో నవీన్ పాదయాత్ర



కాకినాడ సిటీలో..

నేరాలు ఘోరాలు

నగదు చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని బొబ్బర్లంక ఆలయంలో హుండీ పగలగొట్టి అందులోన నగదు దొంగలించిన కేసులో ఒక వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన ఏలిపే చందు గత నెల 25న శ్రీ రామ వయోజన సదనం వద్ద ఉన్న శ్రీరామ మందిరంలోని హుండీని తాళాన్ని బద్దలు కొట్టి అందులో ఉన్న నగదును, ఆశ్రమం తలుపులను పెకలించి గదిలో ఉన్న వంట సామాన్లను పట్టుకుపోయాడని సదనం నిర్వాహకుడు జల్లి కామేశ్వరరావు గురువారం ఫిర్యాదు చేశారు. దీనిపై చందుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువతి అదశ్యమైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం ఇంటి నుండి బయటకు వెళ్లిన కుమార్తె సాయంత్రం అయినా రాకపోవడంతో చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు బంధువుల ఇంటి వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తల్లి పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు

సారా బట్టీలపై దాడి : ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-గోకవరం

రాజమహేంద్రవరం ఎస్ఇబి ఎఎస్పి ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బందితో సారా బట్టీలపై దాడి చేసి 25 లీటర్ల నాటుసారా స్వాధీనం ముగ్గురు వ్యక్తులు అరెస్టు చేశారు. రంప ఎర్రంపాలెం గ్రామానికి చెందిన నకరబోయిన మణికంఠ స్వామి గంగంపాలెం గ్రామానికి చెందిన గంట శివకృష్ణ కామరాజుపేట గ్రామానికి చెందిన నెల్లి కృష్ణను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ముగ్గురిని రిమాండ్‌కు పంపించినట్టు ఎస్ఇబి సిబ్బంది తెలిపారు. రైటప్:సారా కేసులో పట్టుబడిన వ్యక్తులు



సీజ్ చేసిన గ్యాస్ సిలిండర్లు

డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్స్ పట్టివేత

ప్రజాశక్తి-కడియం

కడియం మండలం కడియపుసావరం గ్రామంలో పోలీస్ సిబ్బంది జరిపిన తనిఖీల్లో ఇంటికి ఉపయోగించవల్సిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్స్‌ను విజేత హోటల్లో వాడుతుండగా, 4 నిండు గ్యాస్ సిలిండర్లు, 2 ఖాళీ సిలిండర్లు పట్టుకున్నారు. దీనిపై 6 ఎ కేసు నమో చేసినట్టు సివిల్ సప్లై అధికారి కెఎస్.ప్రభాకర్ తెలిపారు. ఆయనతో పాటు కడియం సిఐ పివిజి.తిలక్, సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డుపైన క్షతగాత్రులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కడియం

కడియం మండలం కడియపులంక 216వ నెంబర్ జాతీయ రహదారిపై డివైడర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వాహనదారులకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వారి వివరాలు ప్రకారం రాజమండ్రి వైపు నుంచి రావులపాలెం వైపు వెళుతున్న బైకు రోడ్డు దాటుతున్న మరో బైకును ఢీకొనడంతో ఇద్దరు వాహనదారులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌పై రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి హైవే పెట్రోలింగ్ సిబ్బంది చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో తమ్మునిపై దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

జి.రాగంపేట గ్రామంలో దేవర దుర్గ అనే వ్యక్తి తన తమ్ముడు అప్పన్నపై కర్రతో దాడికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. గురువారం మద్యం సేవించిన అన్న దుర్గ తమ్ముడు అప్పన్న ఇంటికి వెళ్లి ఘర్షణకు దిగాడన్నారు. మాట మాట పెరగటంతో కర్రతో తమ్ముడిపై దాడి చేశాడన్నారు. ఈ దాడిలో అప్పన్న తలకు తీవ్ర గాయాలు అయ్యాయని, వెంటనే అతనిని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారని పోలీసులు తెలిపారు. ఎస్ఐ వి.సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎఫ్‌సిఐ కార్మికులకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట ఎఫ్‌సిఐ గోదాముల్లో జట్టు కార్మికులుగా పనిచేస్తున్న 14 మందికి గురువారం ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు సత్కారం నిర్వహించారు. స్థానిక ఎఫ్‌సిఐ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైసిపి రాష్ట్ర కార్మిక నాయకుడు, మున్సిపల్ కోఫ్షన్ సభ్యులు దవులూరి సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలిండియా ఎఫ్‌సిఐ వర్కర్స్ యూనియన్ సామర్లకోట శాఖకు చెందిన 14 మంది కార్మికులు ఉద్యోగ విరమణ సభను జట్టు నాయకులు చల్లా ప్రభాకరరావు, రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, ఎఫ్‌సిఐ అసిస్టెంట్ మేనేజర్లు అవినాష్, సందీప్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి రాష్ట్ర కార్మిక నాయకుడు దవులూరి సుబ్బారావు మాట్లాడారు. 14 మంది కార్మికులు ఎఫ్‌సిఐలో డైలీ పేమేంటు విభాగంలో పనిచేస్తూ పదవీ విరమణ పొందారు. కార్మికులు పి.వీరభద్రరావు, పి.అప్పారావు, ఎం..మురళి, ఎం.చినవీర్రాజు, ఎం.పోలయ్య, బి.అప్పలకొండ, జి.సత్యనారాయణ, ఎం.చెల్లారావు, పి.సత్యనారాయణ, ఎం.అప్పారావు, డి.సీతారామయ్య, పి.అప్పారావు, ఎం.త్రిమూర్తులను ఘనంగా సత్కరించారు.

నవోదయ ఫలితాల్లో విక్టరీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కోటనందూరు

జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశ పరీక్షల్లో మండల కేంద్రమైన కోటనందూరులోని విక్టరీ స్టడీ సర్కిల్ రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ ప్రతిభ కనపరిచే సత్తా చాటుకుంది. 2023 ఏడాదిలో రెండు కౌన్సిలింగ్‌లో 11 మంది విద్యార్థినీ విద్యార్థులు ఎంపిక కావడంపై విక్టరీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ పి.చిన్ని వర్షం వ్యక్తం చేశారు. ఉభయగోదావరి జిల్లాలకు అనకాపల్లి, జిల్లాలకు చెందిన 11 మంది విద్యార్థులు నవోదయ విద్యాలయంలో చదవడానికి అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎంపిపి లగుడు శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థిని విద్యార్థులు ప్రతిభను వెలికి తీయడానికి విక్టరీ స్టడీ సర్కిల్ ఎంత దోహద పడుతోందన్నారు. అతి తక్కువ ఫీజులతో ఉత్తమమైన విద్యను అందించడంతోపాటు పేద బలహీన వర్గాల చిన్న, సన్నకారు రైతుల పిల్లలకు ఉచితంగా కోచింగ్ ఇవ్వడాన్ని ఆయన స్టడీ సర్కిల్ డైరెక్టర్‌ను అభినందించారు. రెండవ కౌన్సిలింగ్లో ఎంపికైన విద్యార్థులను శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అడ్వైజర్ కమిటీ చైర్మన్ సుర్ల లోవరాజు, సర్పంచ్ జగటాల వీరబాబు, రాంబాబు, వైసిపి నాయకులు గర్సింగు దొరబాబు, కోఆప్షన్ సభ్యులు జగటాలకోట సత్తిబాబు, ప్రసాద్, ఉపాధ్యాయులు బంటుపల్లి గంగాధర్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాస్ డైరెక్టర్ చిన్ని

న్యాయవాదుల కోర్టు విధులు బహిష్కరణ

ప్రజాశక్తి-ఏలేశ్వరం

న్యాయవాదులపై వరుస దాడులను నిరసిస్తూ ప్రత్తిపాడు కోర్టులో న్యాయవాదులు గురువారం విధులన బహిష్కరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బారు అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య మాట్లాడుతూ అత్యంత భద్రత నడుమ కోర్టు ఆవరణలోనే న్యాయవాదిపై కాల్పులు జరిపి అంతమొందించడం, ఇటీవల బెజవాడ బార్ న్యాయవాదిపై దాడి, మరో న్యాయవాదిపై పోలీసులు అక్రమ కేసులు చూస్తుంటే న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బి.మధుబాబు గౌరవాధ్యక్షుడు చెలంకూరి రామకష్ణ, ఉపాధ్యక్షుడు ఎం.గంగాధర్, స్పోర్ట్స్ కార్యదర్శి లింగంపల్లి శివకుమార్, న్యాయవాదులు కిలపర్తి శ్రీనివాస్, పలివెల నాగేంద్ర, మాదాల మంజుష, అవసరాల దేవి, రాజాల చిట్టిబాబు, గరిమెళ్ల సుబ్రహ్మణ్యం, ఆర్.వెంకట్రావు, పిల్లి బలరాముడు, ఎకెఎన్.మల్లేశ్వరరావు, బండారు నరసింహారావు, రాయి అచ్యుత రామారావు ఉన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సేవ చేసేవారిని ప్రజలు గుర్తు పెట్టుకుంటారు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

సమాజంలో సేవ చేసే వారినే ప్రజలు గుర్తించుకుంటారని మాజీ మంత్రి, వైసిపి నాయకులు తోట నరసింహం అన్నారు. మండలంలోని రామవరంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుతగా ఆయన అనుచరులతో కలిసి కార్యకర్తలను ఆత్మీయంగా కలుసుకున్నారు. గతంలో నేను రాజకీయంలోకి రాక ముందు అన్న తోట వెంకటాచలం సూచనల మేరకు నియోజకవర్గంలోని కార్యకర్తలకు అనేక వైద్య సేవ కార్యక్రమాలు చేసేవాడినన్నారు. ఆ సేవ కార్యక్రమాలే నన్ను రాజకీయాల్లోకి తీసుకొచ్చి ఎంఎల్ఎ, ఎంపీ, మంత్రిగా చేసి ప్రజల మన్ననలు పొందడం జరిగిందన్నారు. అదే తరహాలో రామవరం గ్రామానికి చెందిన యువ నాయకులు రావు గణేష్ రాజా, గుర్రం మహాలక్ష్మి ప్రజలకు అనేక వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఆ వైద్య సేవలే ప్రజల్లో గుర్తింపు పొందుతారన్నరు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అత్తులూరి సాయి బాబు, ఎస్ఎ గఫూర్, తోట అయ్యన్న, రామకుర్తి మూర్తి, రాపేటి శ్రీను, భూపాలపట్నం బాబ్జి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

సంక్షేమ పాలన సిఎం జగన్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

పేద, అట్టడుగు వర్గాల సంక్షేమం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన ద్వారానే సాధ్యమవుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పట్టణ పరిధిలోని 1వ సచివాలయం పరిధిలో 2 ,3 వార్డుల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల అమలు గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, సానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు, సచివాలయ అడ్మిన్ ఎన్.రాజ్ కుమార్, జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, వైస్ ఎంపిపి మిరియాల రాజా, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు ఆరెల్ల వీరరాఘవ, ఆకుల కృష్ణ బాపూజీ, విడదాసరి రాజా, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, గృహసారథుల సంఘం మండల కన్వీనర్ గోపు మురళి, నాగబోయిన రాజబాబు, లక్కాకుల కృష్ణ, శైల గణేష్, రాయి వెంకటేశ్వరరావు, నల్లల గోవిందు, చింతా శ్రీనివాసరావు, సుందర రెడ్డి రాజు పాల్గొన్నారు.



గడపగడపకు మన ప్రభుత్వంలో దొరబాబు



మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

పిహెచ్‌సి సిబ్బందికి వైద్య సేవలపై అవగాహన

ప్రజాశక్తి-అంబాజీపేట

అంబాజీపేట పిహెచ్‌సిలో గురువారం వైద్యాధికారులు వి.గౌతమి, కెఎస్.శ్రీనివాస్ లు ఆరోగ్య సిబ్బందికి వైద్యసేవలపై పలు సూచనలు చేశారు. వారు మాట్లాడుతూ నెలకు తప్పనిసరిగా ఐదు డెలివరీ కేసులు చేయాలన్నారు. టిబి కేసులు గుర్తించి సబ్ సెంటర్‌కు పంపాలన్నారు. లెప్రోసి మచ్చలు ఉంటే చికిత్సకు తీసుకువచ్చి వైద్యాధికారులను చూపించాలన్నారు. ఫీవర్ కేసులు పంపించాలని సిబ్బందికి సూచించారు. పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిహెచ్‌ఒ బి.అప్పారావు, హెల్త్ అసిస్టెంట్, ఎఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



నల్లాకు నివాళులర్పిస్తున్న మంత్రి పినిపే

నల్లా సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-అమలాపురం

నల్లా సూర్యచంద్రరావు సేవలు చిరస్మరణీయమని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. నల్లాసూర్యచంద్రరావు 11వ వర్ధంతి సందర్భముగా గురువారం అమలాపురం గడియారస్తంభం సెంటర్ లో ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, వైసిపి పట్టణ అధ్యక్షుడు మున్సిపల్ కౌన్సిలర్ సంసాని బుల్లి నాని, తుని వైసిపి పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ రుద్రరాజు నాని రాజు, కౌన్సిలర్ నాగారపు వెంకటేశ్వరరావు, అల్లవరం ఎంపిపి ఇళ్ల శేషారావు, పత్తి దత్తుడు , నల్లా చిట్టి తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మిరాజు వర్గీయుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-రామచంద్రపురం


ఎన్నికల ఆరు నెలలు ఉండగానే రామచంద్రపురం నియోజకవర్గం లో అభ్యర్థులు తమ బలాబలాలను ప్రదర్శించుకుంటూ జన సమీకరణలు జరుపు తున్నారు. ఎప్పటి వరకు ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ అనుచర వర్గం ఒక ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేయగా, వెంటనే మంత్రి వేణు వర్గం మరో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసింది, ఈ నేపథ్యంలో జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ గత నెలలో ఒక ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేయగా వైసిపి న్యాయవిభాగం రాష్ట్ర నాయకులు మాగాపు అమ్మిరాజు తన అనుచర గణం తో శుక్రవారం మరో ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఎవరికి వారు ఆత్మీయ సమ్మేళనాలతో తమ భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకునేందుకు తమ అనుచర గణాన్ని అభిమానులను కార్యకర్తలను సమావేశపరిచి తమ బలాన్ని చాటుకుంటున్నారు.

ఆదిత్యలో 'మేరీ మట్టి మేరీ దేశ్'

ప్రజాశక్తి-గండేపల్లి

మండలం ఎర్రంపాలెంలో సూరంపాలెం, ఆదిత్య ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన 'మేరీ మిట్టీ మేరీ దేశ్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల మొక్కలను ప్రభుత్వ, సచివాలయం పరిసరాల దగ్గర నాటారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రమేష్, డీన్ డాక్టర్ పిఎస్‌విఎస్.రవి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

యానాం వార్తలు



గోవా గవర్నర్‌తో పుదుచ్చేరి ఎంఎల్ఎలు

గోవా గవర్నర్‌ను కలిసిన ఎంఎల్ఎలు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి తట్టంచావిడిలో నూతనంగా అసెంబ్లీ భవనాన్ని నిర్మిస్తున్న నేపథ్యంలో గోవా అసెంబ్లీ భవనాన్ని పరిశీలించడానికి 22 మంది ఎంఎల్ఎ బృందం గురువారం గోవాలో పర్యటించింది. పుదుచ్చేరి స్పీకర్ సెల్వం నేతృత్వంలో గోవా వెళ్లిన ఎంఎల్ఎలు గోవా అసెంబ్లీని అక్కడ ఉన్న సదుపాయాలు పరిశీలించింది. ఈ మేరకు పుదుచ్చేరి ప్రభుత్వానికి ఆయా అంశాలతో ఒక నివేదికను సమర్పించనుంది. ఈ సందర్భంగా గోవాలో రాజ్ భవన్‌కు వెళ్లి మర్యాద పూర్వకంగా గవర్నర్ పి.ఎస్.శ్రీధరన్ పిళ్లైను కలిసింది. ఈ బందంలో యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కూడా ఉన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న అలెక్స్ బృందం

గాయపడిన సురేష్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యానాం

ఇటీవల విశాఖ జిల్లా అనకాపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందతున్న గెడ్డం సురేష్‌కు దరియాలతిప్ప గ్రామానికి చెందిన అలెక్స్ బృందం రూ.లక్ష 30 వేల ఆర్థిక సహాయం గురువారం సురేష్ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



మొక్కలు నాటుతున్న బృందం

హైస్కూల్ విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -ఐ.పోలవరం

మండల కేంద్రంలో ఉన్న జిల్లా ప్రజా పరిషత్‌ఉన్నత పాఠశాల వద్ద గురువారం ఆంధ్ర ప్రదేశ్ టూరిజం రీజినల్ డైరెక్టర్ రాజమహేంద్రవరం వారి ఆధ్వర్యంలో యువ టూరిజం క్లబ్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఒంటెద్దు స్వామి నాయుడు వారి బృందం ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు పెంపకం, ప్లాస్టిక్ నివారించుట, స్వదేశీ వస్తువుల వాడకం, సైకిల్ రేస్,ఆర్ట్ ,క్రాఫ్ట్ పరికరాల తయారుచేయుట వంటి అంశాలు లో విద్యార్థులకు అవగాహన కల్పించి పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు ప్రశాంసా పత్రాలు అందజేసారు. ఈ ర్యక్రమంలో జిల్లా టూరిజం ఆఫీసర్ పి.వెంకటాచలం, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వీధి సురేష్ బాబు, సైన్స్ టీచర్ ఎమ్ శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న దర్శించుకున్న జానారెడ్డి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామిని గురువారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ హోం శాఖ మంత్రి జానా రెడ్డి దర్శించుకుని, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈయనకు తొలుత అర్చకులు ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు స్వామివారి చిత్రపటం అందజేశారు. ఈయన వెంట ఆలయ మాజీ చైర్మన్ కరటూరి నరసింహారావు తదితరులు ఉన్నారు.

జాతీయ తెలుగు భాషా క్రీడా దినోత్సవాలు

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట హైస్కూల్ నందు గురువారం హెచ్ఎం కడలి సాయిరాం అధ్యక్షతన జాతీయ తెలుగు భాష, క్రీడా దినోత్సవాలు నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన చంద్ర చిత్రపటాలకు పూలమాలలు వేసి తెలుగు భాష క్రీడల ఔన్నత్యాన్ని పలువురు వక్తలు వివరించారు. ఈ సందర్భంగా తెలుగు భాషపై వ్యాసరచన, క్విజ్, వ్యక్తిత్వం పోటీలు నిర్వహించారు. అరిగెల చిన్న అందించిన రూ.7వేల ఆర్థిక సహాయంతో క్రీడా పోటీలు నిర్వహించి 96 మంది విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. ఉపాధ్యాయులు పెదమల్లు సత్యానందం, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు నడిమింటి సుబ్బారావు లకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కామిశెట్టి మధుబాబు, బి.వెంకటేశ్వరరావు బి.ఉమాదేవి, ఎం.సత్తిబాబు పాల్గొన్నారు.

రైతులకు కిసాన్ డ్రోన్లు ఏవీ..?

రాయితీపై ఇస్తామంటున్న ప్రభుత్వం
నిబంధనలతో రైతులు అనాశక్తి



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

టెక్నాలజీను వినియోగించి వ్యవసాయ రంగంలో మరింత పురోగతిని సాధించడంతో బాటు, రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకుని వచ్చి ఎరువులు, పురుగుల మందుల పిచికారీను సులభం చేయడం కోసం కిసాన్ డ్రోన్లను అందుబాటులోకి తీసుకు వస్తామని ప్రభుత్వం చెప్పింది. జిల్లా వ్యవసాయ శాఖ ఈ ఏడాది ఖరీఫ్ నుంచి వీటిని వినియోగించాలని భావించారు. అందుకోసం రాయితీపై అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కానీ పలు నిబంధనలు వలన డ్రోన్ల కొనుగోలుపై రైతులు ఆసక్తి చూపడం లేదు.

జిల్లాలో ఈ ఏడాది 2.30 లక్షల ఎకరాల్లో వరి, పత్తి 10,237 ఎకరాలు, చెరకు 9,387 ఎకరాలు, మినుములు 2,811, మొక్కజొన్న 595, కందుల 382, నువ్వులు 230, వేరుశెనగ 17 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.పంటలకు చీడపీడలు ఆశించడం వల్ల రైతులు పెద్ద ఎత్తున పంటలను నష్టపోతున్నారు. మరోవైపు అధిక ధరలకు పురుగుల మందులను కొనుగోలు చేసి పిచికారీ చేస్తున్నా పూర్తిస్థాయిలో పంటకు స్ప్రే కాకపోవడంతో చీడపీడలు వదలడం లేదు. ఈ నేపథ్యంలో నిముషాల వ్యవధిలోనే సంపూర్తిగా మందులను పిచికారీ చేసేందుకు వీలు కలుగుతుందని భావించిన ప్రభుత్వం డ్రోన్లను అందుబాటులోకి తీసుకు రానుంది. ప్రస్తుతం పలు రాష్ట్రాల్లో డ్రోన్ ద్వారా క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తూ ఆశించిన ఫలితాలను సాధిస్తున్నారని వ్యవసాయ శాఖ చెబుతోంది. భవిష్యత్తులో ద్రవరూపంలో వచ్చే నానో యూరియా, డీఏపీ ఎరువులకు దీన్ని ఉపయోగించుకునే అవకాశం కూడా ఉందని చెబుతున్నారు. ఎకరాకు కేవలం రూ.100 ఖర్చుతోనే క్రిమిసంహారక మందులు పిచికారీ చేయొచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ డ్రోన్ కొనుగోలు చేసిన రైతులు తమ సొంత పొలాల్లోనే కాక ఇతర రైతుల పంటలకు వినియోగించడం వల్ల రోజుకు కనీసం 10 ఎకరాల్లో పిచికారీ చేసినా రూ.4 వేల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వీటి వినియోగంపై రైతుల్లో ఆసక్తి పెంచేందుకు డ్రోన్ ధరలో 40 శాతం రాయితీ ఇస్తారు. అంటే డ్రోన్ ఖరీదు రూ.10 లక్షలు అయితే దీనిలో రూ. 4 లక్షలు రాయితీగా ఇవ్వగా రూ.లక్ష రైతు చెల్లించాలి. మిగిలిన రూ.5 లక్షలు బ్యాంకుల నుంచి రుణం ఇస్తారు. దీనిలో భాగంగా ఎంపిక చేసిన కొంతమంది యువ రైతులకు ఇప్పటికే గుంటూరులోని ఎన్. జి.రంగా యూనివర్సిటీలో శిక్షణ ఇచ్చారు. కాకినాడ జిల్లాలో 25 మందికి గానూ ఇప్పటి వరకు 18 మందికి శిక్షణ పూర్తి అయింది. ఒక్కో మండలానికి మూడు డ్రోన్లు ఇవ్వాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.తొలి విడతలో జిల్లా వ్యాప్తంగా 25 డ్రోన్లు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపారు.అయితే విధి విధానాలను రావాల్సి ఉంది.

నిబంధనలతో ముందుకు రాని రైతులు

రైతులను గ్రూపులుగా విభజించి డ్రోన్లను రాయితీపై ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. డ్రోన్ ఆపరేటింగ్ చేసే వ్యక్తి డిప్లొమా, ఇంజనీరింగ్ చేయాలని నిబంధన మొదట్లో విధించారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఈ చదువులు చదివే అవకాశం లేనందున పదో తరగతి, ఇంటర్ చదివినవారిని అర్హులుగా పేర్కొన్నారు. ఈ విద్యార్హతలతో పాటు గ్రూపులో ఒకరికి ఖచ్చితంగా పాస్ పోర్ట్ ఉండాలనే నిబంధన విధించారు. పాస్ పోర్ట్ సమస్యలు వల్ల డ్రోన్ కొనుగోలుకు ఎవరు ముందుకు రావడం లేదు. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి డ్రోన్లను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వ ఆలోచనలు క్షేత్రస్థాయిలో ఆయా నిబంధనల వల్ల అమలు కావడం లేదు. ఈ నేపథ్యంలో కిసాన్ డ్రోన్లు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయనేది ప్రస్తుతానికి స్పష్టత లేదు.